## క్లుప్తంగా

### వరసిద్ధి వినాయకుని ఆలయంలో విశేష పూజలు



హోమం చేస్తున్న అర్చకులు

రావికమతం: టి.అర్జాపురం బాలవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకం, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. సంకటహర చతుర్థి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురి దంపతులు పాల్గొన్నారు.

### వలంటీర్ల నియామకానికి ఇంటర్వ్యూలు

నాతవరం: మండలంలోని తొమ్మిది పంచాయతీల్లో వలంటీర్ల నియామకానికి బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పి.జగ్గంపేట, పీకే గూడెం, వై.డి.పేట, వల్సంపేట, మన్యపురట్ల, గుమ్మడిగొండ, వెదురుపల్లి పంచాయతీల్లో వలంటీర్ల నియామకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, కార్యాలయ సూపరిటెండెంట్ పోలుపర్తి పార్థసారథి, పంచాయతీ విస్తరణాధికారి నర్సింహమూర్తి, సీనియర్ అసిస్టెంటు ప్రసాద్, జూనియర్ అసిస్టెంటు లక్ష్మణరావు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వ్యాక్సిన్లు

రోలుగుంట: బుచ్చింపేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బుచ్చింపేట పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదేశాలతో బుధవారం వ్యాక్సిన్లు వేశారు. ఏఎస్ఎం నూకరత్నం ముందుగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు అవసరమైన మందులు పంపిణీ చేశారు. వారు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు.

### ఎంపీడీవో శచీదేవికి డీఎల్‌డీవోగా పదోన్నతి

కె.కోటపాడు: స్థానిక ఎంపీడీవో కె.శచీదేవి డీఎల్‌డీవోగా పదోన్నతి పొందారు. దీంతో ఎంపీడీవో బాధ్యతల నుంచి మంగళవారం ఆమె రిలీవ్ అయ్యారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ప్రస్తుత ఈవో పీఆర్డీ ప్రసాద్‌ను నియమించారు. ప్రభుత్వం తనకు పదోన్నతిపై అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తానని శచీదేవి తెలిపారు.

### రూ.10 లక్షలతో మసీదు ప్రహరీ నిర్మాణం

మాకవరపాలెం: మండల కేంద్రంలో ఉన్న మసీదుకు రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మించనున్నారు. దీనికి బుధవారం మార్కింగ్ ఇచ్చారు. ప్రహరీ నిర్మించాలని ముస్లింలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్ ద్వారా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఈ మేరకు బుధవారం మసీదు చుట్టూ స్థలానికి పీఆర్ జేఈ వెంకటేశ్వరరావు మార్కింగ్ ఇచ్చారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే, స్థానిక నేతలకు ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు.

### వ్యక్తిగత శుభ్రత తప్పనిసరి

గొలుగొండ: ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఎటువంటి వ్యాధులు దరిచేరవని సీహెచ్‌వో ప్రసాద్ తెలిపారు. స్థానిక గురుకుల కళాశాల విద్యార్థులకు బుధవారం ఆయన ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. మంచి ఆహారం తీసుకోవడం వల్ల రక్త హీనత దరిచేరదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రుత్తల రామకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### 8న విద్యాసంస్థల బంద్

చోడవరం రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ, కడప జిల్లాలో కొత్తగా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను కార్యాచరణలో పెట్టాలన్న ప్రధాన డిమాండ్ సాధనకు ఈనెల 8న విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి,యువజన సంఘాలు పిలుపునిచ్చాయి. బుధవారం స్థానికబస్టాండ్ వద్ద వాల్ పోస్టర్‌ను విడుదల చేశాయి. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఈ బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు. పీడీఎస్‌వో జిల్లా నాయకులు సియ్యాద్రి రుద్రి, మౌనిక, కె.నాగేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.వి.నాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు పాల్గొన్నారు.



# సామాజిక సాధికార యాత్రకు విస్తృత ఏర్పాట్లు

- యాత్రకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతున్న శ్రేణులు
- కటౌట్లు, పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ జెండాల ఏర్పాటు



ఘాట్‌రోడ్డులో భారీగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాలు

మాడుగుల: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్రను గురువారం మాడుగుల నియోజకవర్గంలో నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఘాట్ రోడ్డు జంక్షన్ నుంచి సభా ప్రాంగణం వరకు భారీ కటౌట్లు, జెండాలను ఏర్పాటు చేశారు. యాత్రకు భారీగా స్వాగతం పలికేందుకు గ్రామాల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సిద్ధమయ్యారు.

**సభా ప్రాంగణాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి**

సామాజిక సాధికార బస్సుయాత్ర కోసం నిర్వహించిన ఏర్పాట్లు, సభా ప్రాంగణాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మాడుగుల నియోజకవర్గంలో గిరిజన పల్లెలతో పాటు అన్ని గ్రామాల్లో రహదారులు బాగుపడ్డాయన్నారు. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు ఏవిధంగా ప్రజలను మోసం చేశారు, జన్మభూమి కమిటీలు ఏవిధంగా దోచుకున్నాయి, మళ్లీ ఇప్పుడు టీడీపీ నేతలు ఏవిధంగా మోసపూరిత హామీలు ఇస్తున్నారో ప్రజలకు వివరించడంతో పాటు, వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అన్ని సామాజిక వర్గాలకు జరిగిన మేలును వివరించడానికే సామాజిక సాధికార యాత్రను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా నియోజకవర్గం నలుమూలల నుంచి సభకు వచ్చేందుకు మహిళలతో పాటు వేలాది మంది సిద్ధమవుతున్నారని చెప్పారు. ఆ మేరకు సభా ప్రాంగణంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

**భారీ బందోబస్తు**

సామాజిక సాధికార బస్సు యాత్ర నేపథ్యంలో జిల్లాపోలీసు యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులు సభా ప్రాంగణాన్ని పరిశీలించి భద్రత ఏర్పాట్లు చేపట్టారు.



కె.కోటపాడులో బస్సు యాత్ర ఏర్పాట్లను ఎంపీపీ, జెడ్పీటీసీలతో కలిసి పరిశీలిస్తున్న మోహన్‌యాదవ్

**కె.కోటపాడులో..**

కె.కోటపాడు : వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారిక బస్సు యాత్రకు మండలంలో నిర్వహించిన ఏర్పాట్లను బుధవారం డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు పరిశీలించారు. నాడు-నేడు కార్యక్రమంలో ఎ.కోడూరు హైస్కూల్‌లో జరిగిన అభివృద్ధి పనులను బస్సు యాత్రలో భాగంగా మంత్రులు పరిశీలించనున్నారు. ఈ మేరకు పాఠశాలలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను డిప్యూటీ సీఎం పరిశీలించారు. మెయిన్‌రోడ్‌లో గల దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డితో పాటు మంత్రులు పూలమాలను వేయనున్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆయన పలు సూచనలు చేశారు. మాడుగులలో జరిగే సామాజిక సాధికారిక బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లెక్కల శంకరరావు, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

కె.కోటపాడు మండలం మీదుగా గురువారం జరగనున్న వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారిక బస్సు యాత్రను అన్ని వర్గాల ప్రజలు, పార్టీ నాయకులు విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొలుసు మోహన్‌యాదవ్ కోరారు. కె.కోటపాడులో బస్సు యాత్ర ఏర్పాట్లను ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, జెడ్పీటీసీ అనురాధల ఆధ్వర్యంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడంతో పాటు కూడళ్లను వైఎస్సార్‌సీపీ తోరణాలతో అందంగా ముస్తాబును చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, మండల జేసీఎస్ కన్వీనర్ ఏటుకూరి రాజేష్, ఎ.భీమవరం, సూర్రెడ్డిపాలెం గ్రామాల సర్పంచ్‌లు తర్రా శేషు, రొంగలి రాము, సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ వర్రి కిషోర్ పాల్గొన్నారు. బస్సుయాత్రకు ముందుగా కె.కోటపాడు నుంచి యువకులు బైక్‌ర్యాలీని నిర్వహించనున్నట్లు ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు.



ఎ.కోడూరులో నాయకులకు సూచనలు ఇస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: సాధికారిత సామాజిక బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు స్థానిక ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, ప్రజాప్రతినిధుల సారథ్యంలో సమావేశాలు నిర్వహించారు. బుధవారం మండలంలో పలు గ్రామాలల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఆయా గ్రామాలు సర్పంచ్‌లు, ఇతర నాయకులతో సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుయాత్రను విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని చెప్పారు. అనంతరం పలు గ్రామాలకు వెళ్లి స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు.

**సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలి**

దేవరాపల్లి: మాడుగుల మండలం ఘాట్ రోడ్డు జంక్షన్ వద్ద గురువారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరీ, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బూరె బాబురావు కోరారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. కె.కోటపాడు నుంచి దేవరాపల్లి మీదుగా మాడుగుల ఘాట్ రోడ్డుకు చేరుకునే రహదారిలో రోడ్డుకు ఇరువైపులా బుధవారం భారీగా ఫ్లెక్సీలు, వైఎస్సార్‌సీపీ జెండాలను ఏర్పాటు చేశారు.

## దేవాలయాల నిర్మాణానికి రూ.8.5 కోట్లు

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్
- 9 నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం



నిధుల మంజూరు ఆర్డర్‌ను చూపుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గంలోని దేవాలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.8.5 కోట్లు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. నర్సీపట్నం మండలం దుగ్గాడ, చెట్టుపల్లి గ్రామాల్లో బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించి, ఓట్లు తొలగింపునకు గురికాకుండా కన్వీనర్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం ఓటరు జాబితా ప్రక్షాళన జరుగుతున్నందున కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 9వతేదీ నుంచి చేపట్టనున్న ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాల్లో 85 దేవాలయాల నిర్మాణానికి రూ.8.5 కోట్లు మంజూరైనట్టు చెప్పారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని త్వరతగతిన దేవాలయాల నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేవాలయాల నిర్మాణానికి నిధులు తీసుకువస్తామన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు అధికార బలరామ్మూర్తి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, మండల యూత్ నాయకుడు దన్నిన నానాజీ, వైస్‌ఎంపీపీ తాతబాబు, సర్పంచ్ నిద్దర లలిత, పార్టీ నాయకులు నిద్దర శ్రీను, ఇన్నం రమణ, శానపతి వెంకటరత్నం, సత్తిబాబు పాల్గొన్నారు.

### 14 వరకు సోషల్ ఆడిట్ సభలు

రావికమతం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో రూ.13.74 కోట్లతో నిర్వహించిన పనులను జిల్లా రిసోర్స్ పర్సన్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి గ్రామాల్లో సోషల్ ఆడిట్ సభలు నిర్వహిస్తారని ఏపీవో దాడి వెంకటకాశి అప్పారావు తెలిపారు. సోషల్ ఆడిట్‌కు సంబంధించి రావికమతంలో జరిగిన ఫీల్డ్ సిబ్బంది ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం నుంచి నవంబరు 14 వరకూ ఈ తనిఖీలు ఉంటాయన్నారు. బృందం సభ్యులు 14 రోజుల పాటు తనిఖీలు చేసి గ్రామ సభల్లో ప్రజలకు వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నబాబు, జేఈ సుమతి,స్టేట్ రిసోర్స్ పర్సన్ రామారావు, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

## సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

మాడుగుల రూరల్: ఎంతోమంది రంగస్థల కళాకారులను తీర్చిదిద్దిన గంగులకుర్తి సూర్యనారాయణ సేవలు చిరస్మరణీయమని సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల అమ్మతల్లినాయుడు తెలిపారు. సిద్ధాంతి, రంగస్థల కళాకారులకు గురువు గంగులకుర్తి సూర్యనారాయణ 25వ వర్ధంతి కార్యక్రమం బుధవారం కేజే పురంలో ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక హైస్కూలు విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన ఎ.ఉదయశ్రీకి రూ.2000, ద్వితీయ బహుమతిగా ఎం.కీర్తన సంధ్యకు రూ.1500, తృతీయ బహుమతిగా బి.పరిమళకు రూ.1000 నగదుతో పాటు మరో 10 మంది విద్యార్థులకు కాన్సోలేషన్ బహుమతులను అందజేశారు. అనంతరం అమ్మతల్లినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అప్పలరాజుపురం హైస్కూలు ఉపాధ్యాయులు ఆడారి శ్రీనివాసరావు, గంగులకుర్తి గంగాధరం, డాక్టర్ కర్రి వెంకటరత్నాచారి, కర్రి త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

### అమరజీవికి ఘనంగా నివాళి



దేవరాపల్లిలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

దేవరాపల్లి: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని దేవరాపల్లి శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రంథాలయ అధికారి ఓ. శ్రీనివాసరావు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితంగానే ఆంధ్రరాష్ట్రం అవతరించిందని ఆయన విద్యార్థులకు వివరించారు.

**వ్యాసరచన పోటీలు**

రోలుగుంట: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు పొట్టి శ్రీరాముల వీరాభిమాని అయిన అనకాపల్లికి చెందిన భవన నిర్మాణకర్త పిరాట్ల నర్సింహమూర్తి తన సొమ్ముతో బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ పెన్ను, నోట్ పుస్తకాలు, సంచులను పంపిణీ చేశారు. హెచ్ఎం ప్రసాదరావు, ఉపాధ్యాయులు శ్రీరామ్మూర్తి, ఆర్.వి.ఎస్.ఆర్.శర్మ తదితరులు పాల్గొని నర్సింహమూర్తిని అభినందించారు.

## ప్రజారోగ్యమే సీఎం జగన్ ధ్యేయం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సందర్శించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతోందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. లక్ష్మీపురంలో సర్పంచ్ శిరుచోళ్ల గణపతినాయుడు ఆధ్వర్యంలో జగనన్నఆరోగ్య సురక్ష శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో నలుగురు వైద్యులు 460 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వవిప్ కరణం ధర్మశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం నిర్వహించని విధంగా ఇప్పుడు రూపాయి ఖర్చులేకుండా ఇంటి వద్దే వైద్యాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పలు కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునికీకరించడంతో పాటు ఆరోగ్యశ్రీ వైద్య సేవలను విస్తరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీపీ గాడి కాసు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవోపీఆర్డీ చైతన్య, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

### 22 వరకు ఉపాధి పనులపై సభలు

మాకవరపాలెం: గ్రామాల్లో కొత్తగా చేపట్టే ఉపాధి పనులపై ఈ నెల 22 వరకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఏపీవో వరలక్ష్మి తెలిపారు. మండలంలోని జెడ్.గంగవరం, పి.పి.అగ్రహారం గ్రామాల్లో బుధవారం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ 2024-25 ఏడాదిలో చేపట్టే కొత్త పనులను మూడు రోజులపాటు గుర్తిస్తామన్నారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి స్థానికులకు పనుల వివరాలను తెలియజేసి వారి ఆమోదం తీసకుంటామన్నారు. మండలంలోని 31 పంచాయతీల పరిధిలో ఈ గ్రామసభలు ఏర్పాటు చేస్తామన్నారు.

## భూ వివాదం పరిష్కారానికి చర్యలు



గ్రామసభలో సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: మండలంలో ఎం.బెన్నవరం పంచాయతీలో డి.ఫారం పట్టా భూమి వివాదం పరిష్కారానికి తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాసనాయుడు బుధవారం చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ గ్రామాన్ని సందర్శించిన తహసీల్దార్.. గ్రామ పెద్దలు, వివాదానికి దిగిన ఇరువర్గాల వారితో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఆ భూమి వివరాలను పెద్దలను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల్లో ఉన్న ప్రకారం సర్వే చేసి సరిహద్దులను నిర్ణయిస్తామని చెప్పారు. ఎలాంటి వివాదాలకు దిగకుండా సక్రమంగా ఉంటే మంచిదని, లేకపోతే ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. వివాదాల జోలికి పోబోమని గ్రామసభలో ఇరువురూ అంగీకారానికి వచ్చారు. దీంతో గ్రామపెద్దల సమక్షంలో వెంటనే సర్వే చేసి సమస్య పరిష్కారం చేయాలని వీఆర్వో బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనులను తహసీల్దార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తమరాన లోవకృష్ణ, సర్పంచ్ మార్తి నాగమణి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

## చెరువుల్లో చేప పిల్లల పెంపకంతో ఉపాధి



రావికమతంలో చేప పిల్లలను విడిచి పెడుతున్న అధికార్లు, రైతులు



కొమరవలో ఆవలోకి చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు



ధర్మసాగరం చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న గొంప కన్నయ్యనాయుడు

- జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి నాగమణి

రావికమతం/రోలుగుంట: చెరువుల్లో చేప పిల్లలు పెంపకంతో ఉపాధి లభిస్తుందని జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి టి.నాగమణి తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద రోలుగుంట మండలం కొమరవోలు ఆవలో 50వేల చేప పిల్లలు, రావికమతం పెద్దిరాజు చెరువు, మేడివాడ పెద్ద చెరువుల్లో ఐదువేల చేప పిల్లలను బుధవారం ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు విడిచి పెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఆదాయం, పలువురికి ఉపాధి కల్పించడంతో పాటు చేపల పెంపకంపై ఆసక్తి కల్పించేందుకు ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టినట్టు చెప్పారు. కొమరవోలులో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు శ్రీనివాసరావు, ఎంపీటీసీ గొర్లె వెంకటరామన్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మత్స్య శాఖ సహాయాధికారులు శ్రీలక్ష్మి,పుష్ప,రామకృష్ణ పాల్గొన్నారు.రావికమ తం మండలంలో జరిగి న కార్యక్రమంలో ఆ యా గ్రామాల ఉపసర్పంచ్‌లు గెంజిమోదినాయుడు,వజ్రపు శివ పాల్గొన్నారు.

**మత్స్యకారులసంక్షేమమేప్రభుత్వ ధ్యేయం**

నర్సీపట్నం: మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని నర్సీపట్నం మండలం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు తెలిపారు. నర్సీపట్నం పెద్దచెరువు, ధర్మసాగరం, పెదబొడ్డేపల్లి చెరువుల్లో బుధవారం చేపపిల్లలను విడుదల చేశారు.

నర్సీపట్నం చెరువులో మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు, ధర్మసాగరం చెరువులో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కన్నయ్యనాయుడు, జెడ్పీటీసీ సుకల రమణమ్మ మత్స్యశాఖ అధికారులతో కలిసి చేపపిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి టి.నాగమణి మాట్లాడుతూ నర్సీపట్నం చెరవులో 15,360, పెదబొడ్డేపల్లి చెరువులో 8 వేలు, ధర్మసాగరం చెరువులో 12 వేల చేప పిల్లలను విడుదల చేశామన్నారు.

### ట్రాక్టరు పైనుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మాడుగుల రూరల్: జి.అగ్రహారం గ్రామానికి చెందిన ఆర్లె లింగునాయుడు (60) ట్రాక్టరు మీది నుంచి జారిపడి మృతి చెందారు.స్థానిక ఎస్ఐ పి.దామోదర్‌నాయుడు తెలిపిన వివరాలు. లింగునాయుడు గత కొంత కాలంగా ట్రాక్టరు మీద పనిచేస్తున్నారు. బుధవారం వీరవల్లి అగ్రహారం వద్ద శారదా నదిలోకి ట్రాక్టరు వెళ్తుండగా, ట్రాక్టరు మీద కూర్చున్న లింగునాయుడు జారిపడి మృతి చెందారు. సర్వే కర్రలు లోడింగ్ చెయ్యడానికి ట్రాక్టరు నదిలో నుంచి అవతలి ఒడ్డుకు వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. దివ్యాంగుడుఅయిన మృతుని భార్య కొన్నేళ్ల క్రితం మరణించగా, అతనికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ నందారపు మంగమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్లె మాధవి పరామర్శించారు.